
(తెలుగు కళా సమితి న్యూజెర్సీ ప్రజోత్పత్తి ఉగాది కథల పోటీలో రూ. 300/-లు గెలుచుకున్న కథ)

# అమ్మ





-జె. స్వర్ణలత

చుక్కల అద్దాలు కుట్టిన నల్ల చీరలా ఆకాశం ... పిల్లలిద్దర్నీ గుండెల మీదేసుకుని పైకి చూస్తూ పడుకున్న విమల కళ్ళు ఆమెకి తెలియకుండానే వర్షిస్తున్నాయి.

'రెండు నెలల క్రితం ... ఇదే వేళకి తను భర్తతో నవ్వుతూ కబుర్లు చెప్పింది... ఇప్పుడు అతను లేడు. ఏముందిప్పుడు? పెద్ద శూన్యం. గాఢమైన వెలితి, కోరికలు మనసుని మరుక్కుమన్పించింది చాలా తక్కువ. అంతకు మించిందేదో ... ఏదో జీవం... బలం... బ్రతుకు మీద ఆశపోయి ఆరిపోయిన అనుభూతి మాత్రం మిగిలింది. చీకటి పడుతూంటే ... ఇంటికి కొస్త దూరంలో వుండగానే ... అతని అడుగుల చప్పుడు... గుండె వీణని మీటుతూ... రసగంగ ప్రవాహానికి ఆనకట్ట తెగ్గొడుతున్నట్లు ఉప్పొంగడం... రాత్రి మూసిన తలుపుల వెనక... పిల్లలూ అతని మధ్య భవిష్యత్తుని ఊహల బాణాల్తో తడుముతూ ... ఏదీ ఆ ఆనందం? 'అతను లేడు' అన్న నిజంతో తన పోరాటాన్ని భరించలేక పోతోంది. అతన్తో పాటు తన ఆశలు ... కలలు ... ఆనందం... యవ్వనం అన్నీ... అన్నీ మాడి మసైపోయాయి. కనబడని ఆ సతి సహగమనం... తర్వాత ఈ కట్టెని ఎన్ని రోజులు ఈ భూమ్మీద నిలబెట్టడం? చాలా కోపం కూడా కలుగుతోంది... ఈ పుణ్యభూమి మీద మగాడితో ఆడదాన్నెందుకింత బలంగా ముడి వేయాలి? మెదడులో చెరిగిపోని ముద్రల్ని ఎందుకు వెయ్యాలి? ఆలోచిస్తున్న విమల ... మెడమీద వెచ్చని స్పర్శకి ఉలిక్కి పడింది.

'నేను విషాదమైన కలలో మునిగాను... నా భర్త తిరిగొచ్చేశాడు'అన్న భ్రమలో ఆమె మనసు పెనుగులాడింది... ఒక్క క్షణం ... భ్రమవిడిన తర్వాత... ఎదురుగా నిలబడ్డ వాస్తవాన్ని చూసి వణికి పోయింది.

ఆ ఆకారం మీద వెలుతురు చార పడుతూంది. గుబురు మీసాల క్రింద ఆ పెదవులు ... నాలికలు బైటకి పెట్టి లోపలికి తీసుకుంటున్నట్లు కనబడుతూ ... ఆ వెలుగు పొడలో మచ్చల పాములా ... అతను బావగారు! భుజాల మీద నుంచి చేతులు యవ్వనపు పొంగుల మీదకి జారుస్తూ ... బాగా వంగి ... తన పెదవుల్ని ముద్దు పెట్టుకుంటూంటే ... విమల రక్తం నీరైపోయింది. లేవడానికీ, అరవడానికీ లేదు, గుదిబండల్లా పిల్లలూ, ఆ మగాడూ!

నిస్సహాయత... అసహ్యం.... కోపం... జుగుప్స ... కల్సిన కన్నీళ్ళు. చెవి దగ్గర నెమ్మదిగా చెప్పాడు రంగారావు. "రేపు రాత్రికి ఆఫీసు గదికొచ్చెయ్. అనవసరంగా హైరానా పడితే అనుభవిస్తావు."

విమలకి బలమైన షాక్. ఆలోచేన్లన్నీ ఇసుక రేణువుల్లా మారి మెదడులో గిరగిరా తిరుగుతూ ఎడారిలో చెలరేగిన భయంకరమైన ఇసుక తుఫానులా ... ఏదో హోరు... రొద. ఎప్పటికో ఆ తుఫాను తీవ్రత నెమ్మది నెమ్మదిగా తగ్గింది. తగ్గిన తర్వాత ఆవేశం కొరడాలా మనసుని ఝుళిపించింది. దగ్గర్లోనే వున్న గునపం అందుకోవడానికి విసురుగా లెస్తూంటే ఆమె వంటి మీద నుంచి దొర్లిన పసి బిడ్డలు నిద్రలో కదిలి "అమ్మా... అమ్మా..." అని కలవరిస్తూంటే విమలలో వివేకం మేల్కొంది. చప్పున మంచం మీద కూలబడింది. దోసిట్లో మొహం దాచుకుంది.

అంత వరకు భర్తలేని లోటుకి ఏడ్చు కుంటున్న విమలలో ఆ బాధని డామినేట్ చేస్తూ బ్రతుకు భయం బయల్దేరింది. అందుక్కారణమూ వుంది. అది ఉమ్మడి కుటుంబం. గొడ్డూ గోదా ... పాడీ పంటా పుష్కలంగా వున్న డబ్బున్న ఆ లోగిట్లో రంగారావు అన్నదే వేదం.

చేసిందే శాసనం. నలుగురన్నదమ్ముల్లో పెద్దవాడు రంగారావు. మూడవ తమ్ముడి భార్య విమల. రంగారావు కెదురు చెప్పి ఆ లోగిట్లో పిట్ట కూడా మంచినీళ్ళు తాగలేదు. అలాంటిది ఆడపిచ్చి వున్న రంగారావుని కాదని ఒంటరిదైన విమల మనలేదు. దేన్నయినా కోరుకుంటే సాధించే వరకు నిద్రపోని అతగాడి నైజం విమలకి తెలుసు.

విమలకి పెదవుల మీద విషం పూసినట్లుంది. వెగటైన బాధ. లేచి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చి పడుకుంది. అయినా గొంగళి పురుగులాంటి స్పర్శ తాలూకు రోత వదలడం లేదు.

పిల్లల్ని లేపి, గదిలోకెళ్ళి, తలుపు గడియ వేసుకుని పావురాయిలా ముడుచుకుని పడుకుంది. ఏదో ఆర్తి, దిగులు ... గుండెని ముళ్ళ చక్రంలా కోరుతున్నాయి.

'రంగారావు ... ఆఫీసు గది ... ఆ ఏకాంతం ... భగవంతుడా ... ఎందుకు నాకీ శిక్ష? అమ్మా ... నాన్నమ్మా ... అమ్మమ్మా ... ఎందుకు మీరంతా నా రక్తంలో ఈ పాతివ్రత్యమనే నిషాని ఎక్కించారు? కనబడని పతివ్రతా ధర్మాల పచ్చబొట్లు ఎందుకు నా మనసు పొరల మీద చెక్కారు? ఈ సంస్కృతి నాకేమిచ్చింది? సంఘర్షణ ... ఎప్పుడూ ... మంచీ ... చెడూ ... నీతీ ... అవినీతీ ... సరిహద్దుల దగ్గర తారట్లాట ... భర్త వున్నప్పుడు శోభనిచ్చిన ఈ నీతి ... ఇప్పుడు ఊపిరి విడుస్తూంటే ... ఎవరు కాపాడ తారు? ఇప్పుడు తనేం చెయ్యాలి? పుట్టింటి ఆశ లేదు. దిక్కులేని తనానికి తలవంచి 'మూణ్ణీ మిషాలు' అని కళ్ళు మూసుకోగలదా? ఆ వూహే కంపరంగా వుంది. విమల ఏడుపుతో తెల్లవారింది.

పిల్లల్ని స్కూళ్ళకి పంపించింది. చిన్నక్లాసులు చదువుతున్నారు. వాళ్ళు వెళ్ళిన తర్వాత ఏదో ఒకటి చెయ్యాలి కాబట్టి చేటలో బియ్యం తెచ్చుకుని ఏరుతూ కూర్చుంది. ఏరిపారేస్తున్న ధాన్యపు గింజల కోసం పిచ్చుకలు చేరాయి. వాటికి ఎదురుగా కనబడుతున్న గింజల్ని నోట్లో వేసుకోవాలన్న ఆరాటం... దాన్ని మించిన ప్రాణభయం ... కిచకిచ గోల చేస్తున్నాయి. వాటిల్లో ఒకే ఒక్కటి ... అతి నెమ్మదిగా దాదాపు ... విమల పాదాల దగ్గరగా వచ్చి రెండు గింజలు నోట కరుచుకుంది. విమల తలెత్తే లోగానే పారిపోయింది. దాన్ని చూస్తూ ఆలో చిస్తున్న విమల ఆలోచనకి క్రమంగా ఓ ఆకారం ఏర్పడింది.

***

ఓ గంట తర్వాత విమల భారంగా ఈడ్చుకుంటూ రంగారావు ఆఫీసు గదిలోకి అడుగు పెట్టింది. తలెత్తి చూసిన రంగారావు మొహం మాడిపోయింది.

'రాత్రికదా నేను చెప్పింది?' తనలో తనే గొణుక్కున్నాడు. అతని చుట్టూ వున్న పెద్ద మనుష్యులొక్కసారి నిశ్శబ్దమైపోయారు. ప్రపంచంలో బాధంతా విమల మొహం మీద పరచినట్లుంది. విశ్వప్రయత్నం మీద విమల, రంగారావు దగ్గరగా వచ్చి టేబుల్ అంచు పట్టుకుంది.

"మీరే నాకు దిక్కు ... ఈ బాధ భరించలేకపోతున్నాను. నన్ను ... నన్ను టౌన్‌కి" తర్వాత పూర్తిచెయ్యలేక నేల మీద కూలబడిపోయింది.

రెండు గంటల తర్వాత విమల నర్సింగ్ హోమ్‌లో వుంది ... ఎగ్జామినేషన్ టేబుల్ మీద. తనకి రెండు డెలివరీలు చేసిన ఆ డాక్టర్ చేతులు పట్టుకుని, ఒకే ఒక్క కోరిక కోరింది ... డాక్టరు సహృదయంతో ఒప్పుకుంది.

దాదాపు ఇరవై రోజుల తర్వాత ఆ లోగిట్లో శుష్కించిన శరీరంతో అడుగు పెట్టింది విమల. ఆమె ఎదురుపడినా రంగారావు కన్నెత్తి చూడలేదు. ఏముందామెలో? మూడు నెలల కడుపు పోయి ... గర్భ సంచీ రోగగ్రస్తమై సంసారానికి పనికిరాని ఆడది. అయితే విమల ఏదో ప్రేమ పొంగి పొర్లిపోతున్నట్లు చాలా శ్రద్ధతో అతని పనులన్నీ చేయడం మొదలుపెట్టింది. ముతక చీర... వేలు ముడి ... 'అర్ధాకలితో శరీరాన్ని దహించుకోవడం .. 'అందాల విమల' పొగ మారిన కట్టెలా అయింది కొన్ని రోజులకి. అయితేనేం ... పవిత్రతని దక్కించుకుంది.

అయితేనేం ... ఆ లోగిట్లో ఆమె పిల్లలకి అన్నీ సక్రమంగా జరుగుతూ వచ్చాయి. పెళ్ళిళ్ళు ... చదువులు ... కొడుకు పెద్ద చదువు చదివి, మంచి జీవితంలో స్థిరపడ్డాడు. కూతురుకి భారీగా కట్నమిచ్చి పెళ్ళి చేశారు. తెల్లారితే ఆ పిల్ల అత్తగారింటికెళ్ళి పోతోంది. కన్నీళ్ళతో ఆ రాత్రి తనని తనతో వచ్చెయ్యమని అడుగుతూంటే నవ్వుతూనే తిరస్కరించింది విమలమ్మ.

'మీరు సుఖంగా వుంటే చాలు ఈ అమ్మకి' తనలో తను గొణుక్కుంది. 'అమ్మ ... మాతృధర్మానికి అంకితమై ... తనని తను సబ్బు బిళ్ళలా అరగదీసుకున్న అమ్మ. ఈ అంకిత భావం స్త్రీలో లేకపోతే ... ప్రపంచం ఎలా వుండేది?' మరుభూమి ... అంతే.

## పార్టీ

"కనుక మహాశయులారా! నేనూ మా పార్టీ, మీకూ, దేశానికీ యిన్ని సంవత్సరాలుగా చేసిన సేవలను గుర్తుంచుకొని, మీ పవిత్రమైన ఓటును, 'కల్లోలం' పార్టీ గుర్తు..

(వెనక నుండి సెక్రటరీ- సార్ ఈసారి మీరు 'బీభత్సం' పార్టీ తరఫున పోటీ చేస్తు న్నారు)

"క్షమించండి. 'బీభత్సం' పార్టీ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా, సవినయంగా మనవి చేస్తున్నాను."

## గుర్తుంటాయి

"నా ప్రజలారా, కిందటిసారి ఎన్నికలప్పుడు కొన్ని వాగ్దానాలు చేశాను. పదిహేను నెలలే అయింది కాబట్టి అవి మీకింకా గుర్తుండే వుంటాయి. వాటిని మరలా చెప్పి మీ అమూల్యమైన కాలం వృథా చేయదలచుకోలేదు. ఆ వాగ్దానాలను దృష్టిలో వుంచుకొని, నాకు ఓటువేసి గెలిపించమని, సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

"ఇంకొక చిన్న మనవి. ఆ వాగ్దానాల లిస్టు మీలో ఎవరైనా, మా సెక్రటరీకి అందచేయమని కోరుతున్నాను."

## ఒకరికి - ముగ్గురా

"ఒకే పార్టీ తరఫున ముగ్గురు అభ్యర్థులను ఎలా నిలబెడతారండీ. రిజల్ట్సు ఎలా తేలతాయి. ఈ నామినేషన్లు చెల్లవు"

"సారీ. ఎన్నికలయిన తర్వాత, మా పార్టీ అభ్యర్థులు ఇద్దరు ఉపసంహరించుకుంటారు. వారికొచ్చిన ఓట్లు మూడవ అభ్యర్థికి కలిపి ఫలితాలు నిర్ణయించండి. అన్నీ మా పార్టీకి పడ్డ ఓట్లే కదా."

## అన్యాయమా

"చైర్మనుగారి ఫ్యాను, కోటుకు రెండు గుండీలు పెట్టుకోనంత మాత్రాన, చైర్మనుగారిని రాజీనామా చేయమనడం అన్యాయం కాదా."

"అన్యాయమా? ఎందుకవుతుంది? రాజీవ్ గాంధీ ఇంటి ముందు ఇద్దరు పోలీసులు రోడ్డు మీద తిరిగినంత మాత్రాన ప్రధాన మంత్రి చంద్రశేఖర్ రాజీనామా చెయ్యాలేదూ?"

— వి.వి.సీతారామ్‌దాస్,
గుంటూరు

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్